క్లుప్తంగా

నేటి నుంచి బైబిల్ మిషను మహాసభలు

సీటీఆర్ఐ: క్వారీ మార్కెట్ సమీపంలో మంగళ, బుధ, గురువారాల్లో జరిగే బైబిల్ మిషను మహాసభలను జయప్రదం చేయాలని బైబిల్ మిషను ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎన్.వి జయరాజు పిలుపునిచ్చారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం 6:30 నుంచి సభలు ప్రారంభమవుతాయన్నారు. రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, ఎంపీ మార్గాని భరత్ రామ్ అతిథులుగా హాజరవుతారన్నారు. ఆయన వెంట డాక్టర్ ఎస్.సిమ్యోన్ సుదర్శన్, ఎస్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి తదితరులు ఉన్నారు.

వినతిపత్రం అందజేత

సీటీఆర్ఐ: గోకవరం మండలం రంపఎర్రంపాలెంలోని సుందరమ్మ సత్రం భూముల అవినీతి, అక్రమాలపై కలెక్టర్ విచారణ జరిపించి వేలం పాట నిర్వహించాలని కోరుతూ ఏపీ రైతు కూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జేసీ తేజ్ భరత్‌కు వినతి పత్రం అందజేశారు.

నేడు సమావేశం

కడియం: కడియపులంకలోని సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు వర్మీకంపోస్టుపై అవగాహన సమావేశం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) తెలిపారు. జాన్ సహస్ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విజిలెన్స్ దాడులు



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో అధికారులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు సోమవారం ధవళేశ్వరంలోని ఇమ్మి కేటరింగ్ పాయింట్‌పై దాడులు నిర్వహించారు. ఇందులో కమర్షియల్ సిలిండర్లకు బదులుగా ఆరు డొమెస్టిక్ సిలిండర్లు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. యజమాని ఎస్.ఇమ్మాన్యుయేల్‌పై 6ఏ కేసు నమోదు చేశారు. కార్యాలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, జియాలజిస్టు లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు వలీ, లోవకుమార్ పాల్గొన్నారు.

ఐఎంఏ నిరసన దినం

కంబాలచెరువు: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన దినం పాటించామని ఐఎంఏ నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ గురుప్రసాద్, డాక్టర్ విజయభాస్కర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఇటీవల రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య హక్కుచట్టం అమలులోకి తెచ్చిందని, ఈ చట్ట ప్రకారం ప్రైవేటు ఆస్పత్రులు ప్రజలందరికీ ఉచితంగా వైద్యం చేయాలని నిర్ణయించిందన్నారు. దీనికిగాను వారికి ప్రభుత్వం చెల్లింపులు చేయడంపై సరైన విధివిధానాలు స్పష్టం చేయలేదన్నారు. దీనిపై రాజస్థాన్‌లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ప్రైవేట్ వైద్యులపై పోలీసులు లాఠీచార్జి చేశారన్నారు. దీన్ని ఐఎంఏ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజమహేంద్రవరం రూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక హుకుంపేట డిబ్లాక్‌కు చెందిన హాయ కృష్ణ (40) ఆదివారం అర్ధరాత్రి ఇంటిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇటీవల కాలంలో ఇల్లు నిర్మించడంతో అప్పులపాలై.. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు సాయం

సీతానగరం: జక్కంపూడి రామ్మోహన్‌రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పలు కుటుంబాలకు సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు నిత్యావసరాలు అందజేశారు. రఘుదేవపురంలో ఆరు, రాపాకలో ఆరు, కూనవరంలో రెండు, చినకొండేపూడిలో నాలుగు, సింగవరంలో ఏడు, పురుషోత్తపట్నంలో నాలుగు, వంగలపూడిలో రెండు కుటుంబాలకు జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్ వారి అక్షయ సంజీవిని కార్యక్రమంలో భాగంగా బియ్యం, రూ. రెండు వేలు విలువైన నిత్యావసరాల కిట్లను అందించారు. కార్యక్రమంలో చల్లమళ్ల సుజీరాజు, సుంకర నరసింహం, సర్పంచ్ శ్రీనివాస్, మట్ట శ్రీను, చిర్ల పోశియ్య, పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.రాజు, హెల్త్ అసిస్టెంట్ సుంకర నగేష్‌బాబు, ఫౌండేషన్ కోఆర్డినేటర్ రూష్వా పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

రాజానగరం: బాల్య వివాహాలను ప్రోత్సహించినా, సహకరించినా నిషేధం చట్టం 2006 ప్రకారం సంబంధిత వ్యక్తులకు రూ.లక్ష జరిమానా, రెండేళ్లు జైలుశిక్ష పడుతుందని జిల్లా చైల్డ్ లైన్ 1098 కో ఆర్డినేటర్ బి. శ్రీనివాసరావు అన్నారు. సంపత్‌నగరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రమేష్ అధ్యక్షతన 'సమస్య మీది పరిష్కారం మాది' పేరుతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలలతో పనులు చేయించడం కూడా నేరమేనన్నారు.

కొందరి స్వార్థం.. సేవలకు ఆటంకం

- ప్రభుత్వాసుపత్రిలో రోగుల ఇబ్బందులు
- కొందరు డాక్టర్లపై ఆరోపణలు



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రతి పేదవాడికి వైద్యం ఉచితంగా అందాలి. ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదు. వైద్యం అందక ఇబ్బందులు పడకూడదు అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పలు విప్లవాత్మక మార్పులు తీసుకుని వచ్చి ప్రభుత్వాసుపత్రులను బలోపేతం చేస్తోంది. అయితే రాజమహేంద్రవరంలోని ప్రభుత్వాసుపత్రిలోని కొందరు వైద్యులు ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఆసుపత్రికి వస్తున్న రోగులను నిర్లక్ష్య ధోరణితో చూస్తున్నారని, పూర్తిస్థాయిలో పరీక్షించకుండా ఏవో నాలుగు మందులు రాసి పంపిస్తున్నారని చెబుతున్నారు. కొద్దిరోజుల తర్వాత అదే రోగి వచ్చి వైద్యునికి చూపించుకున్నా, తిరిగి పాత మందులనే వాడాలని సలహా ఇచ్చి పంపేస్తున్నారు. ఈ తంతు ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు తెలిసినా పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

బోధనాసుపత్రిగా..

రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధనాసుపత్రిగా మారింది. దీంతో అందరూ సంతోషపడ్డారు. బోధనాసుపత్రిగా మరిన్ని మెరుగైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుతాయని అనుకున్నారు. ఆ వైద్యసేవల మాట అటుంచితే వచ్చిన రోగులను సరిగ్గా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వైద్యం కోసం అక్కడికి వచ్చిన వారు చెబుతున్నారు. పాత ఆసుపత్రిగా ఉన్నప్పుడే వైద్యం బాగా అందేదని, వచ్చిన రోగం తొందరగా తగ్గేదంటున్నారు. ఇప్పుడు ఏ సేవలు ఎక్కడ, ఎవరు చేస్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రి లోపలికి రాగానే అంతా గందరగోళంగా మారిందంటున్నారు. పాత ఆసుపత్రి హయాంలో ఒక పద్ధతిలో వైద్య సేవలు అందేవని, ఇప్పుడు మొత్తం తారుమారైందని చెబుతున్నారు.

చర్యలు చేపడతాం

ఆసుపత్రిలోని కొందరు వైద్యులు విజిటింగ్ కార్డులను ప్రైవేట్ ఆసుపత్రుల పేరుతో ప్రింట్ చేసుకుని, రోగులకు ఇచ్చి వారిని అక్కడికి రప్పించుకుంటున్నారనే విషయం నా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ చేపడతాం. నిజనిర్ధారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపడతాం. వైద్యులు సరిగ్గా చూడకుండానే మందులు రాసిచ్చేస్తున్నారు అన్న విషయాన్ని కొందరు రోగులు నేరుగా వచ్చి చెప్పారు. అయితే సూపర్‌స్పెషాలిటీ వైద్యులు రోగిని వెయిట్ చేయించకుండా ప్రాథమికంగా పరీక్షించి వైద్య చికిత్సలు అందిస్తున్నారు. పరీక్షలు చేయకుండానే వైద్యం చేస్తుండడంతో ఇటువంటి సమస్యలు వస్తున్నాయి.

– డాక్టర్ మనోజ్, డిప్యూటీ సూపరింటెండెంట్, సర్వజన ఆసుపత్రి

వేరే హాస్పిటల్‌కు సిఫారసు

ముఖ్యంగా పేదవాళ్లు ప్రభుత్వాసుపత్రికి వచ్చి.. వైద్యసేవలను వినియోగించుకుని అనారోగ్యం నుంచి ఉపశమనం పొందుతుంటారు. అయితే చేతిలో చిల్లిగవ్వ కూడా లేకుండా వచ్చిన రోగులను ఆసుపత్రిలో కొందరు వైద్యులు భయాందోళనకు గురి చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వారిని తమకు నచ్చిన ప్రైవేట్ ఆసుపత్రులకు రప్పించుకుని వైద్యచికిత్సలు అందించి రూ.వేలు గుంజుతున్నారు. మరికొందరు ఇంకాస్త ముందుకు వెళ్లి ఏకంగా ఏ ఆసుపత్రులకు రావాలో ఆ చిరునామా, ప్రభుత్వాసుపత్రి వైద్యుని పేరుతో విజిటింగ్ కార్డులను రోగి చేతికి ఇచ్చేస్తున్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

రాజమహేంద్రవరం సిటీ: నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ ఆర్థిక సంవత్సరానికి పన్నుల వసూలును పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యం, సుందరీకరణ తదితర పనులను పూర్తిచేస్తున్నామన్నారు. దీనికోసం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు, వ్యాపారస్తులు పన్నులను సకాలంలో చెల్లించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సకాలంలో ఆస్తిపన్నులు చెల్లింపు ద్వారా అపరాధ రుసుం నుంచి ఉపశమనం పొందాలన్నారు. స్పందన కార్యక్రమంలో 29 అర్జీలు స్వీకరించామన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, సిటీ ప్లానర్ జి.సూరజ్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, డిప్యూటీ కమిషనర్ జి.సాంబశివరావు పాల్గొన్నారు.

వైభవంగా చంద్రమౌళీశ్వరుని విగ్రహ ప్రతిష్ఠ



చంద్రమౌళీశ్వరాలయం శిఖర ప్రతిష్ఠాపన



కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: మాధవరాయుడుపాలెంలోని భువనేశ్వరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామితో పాటు 18 దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. బాలాత్రిపుర సుందరీ పీఠం నిర్వాహకుడు గరిమెళ్ల వెంకట రమణ శాస్త్రి పర్యవేక్షణలో 16 మంది వేద పండితులు ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ అన్నందేవుల చంటి, మాజీ ఎంపీపీ అన్నందేవుల విజయ దంపతులతో పాటు పలువురు దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా నాలుగు రోజులు హోమాలు, నిత్య పూజలు నిర్వహించారు. నిర్ణీత ముహూర్తానికి విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన జరిపించారు. సాయంత్రం లక్ష్మీనారాయణస్వామికి లక్ష తులసిపూజ, శివపార్వతుల దివ్యకల్యాణం జరిగాయి. మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భారీ అన్నసమారాధన నిర్వహించారు. గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దర్శించుకున్న ప్రముఖులు

విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం చంద్రమౌళీశ్వర స్వామిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, రూరల్ కో ఆర్డినేటర్, ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు, జనసేన జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దర్శించుకున్నారు.

ఘనంగా అమ్మవార్ల జాతర



అమ్మవారి గరగలతో ఎంపీ భరత్‌రామ్

సీటీఆర్ఐ: రాజేంద్ర నగర్‌లోని గజ్జాలమ్మ, కుమారి థియేటర్ సమీపంలోని వుంతలో ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాల్లో ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గజ్జాలమ్మ ఆలయంలో అమ్మవారి గరగలను ఎంపీ భరత్, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి శిరసున ధరించారు. అమ్మవార్ల గ్రామోత్సవంలో పాల్గొన్నారు. 21వ డివిజన్ ఇన్‌చార్జి ఏవీ రమణ, 22వ డివిజన్ ఇన్‌చార్జి దూర్వాసుల సత్యనారాయణ, బళ్లా శ్రీనివాస్, పల్లా సాయి పాల్గొన్నారు.

పాండురంగస్వామికి పూజలు

స్థానిక జాంపేట మార్కెట్ సమీపంలోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి ఆలయ విగ్రహ పునః ప్రతిష్ఠాపనా మహోత్సవంలో వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్ రామ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికి నూతన వస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు. పండితులు వేదాశీస్సులు అందించారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి, మహాలక్ష్మి, ఆంజనేయస్వామి ఉపాలయాలను ఎంపీ భరత్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వార్డ్ ఇన్‌చార్జి ముప్పన శ్రీను పాల్గొన్నారు.

గిరిజనుల మరణాలపై విచారణ జరపాలి

సీటీఆర్ఐ: ఇటీవల జరిగిన గిరిజనుల అనుమానాస్పద మరణాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆదివాసీ మహాసభ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించింది. ఆ సంఘ న్యాయసలహాదారు అయినాపురపు సూర్యనారాయణ మాట్లాడుతూ అడ్డతీగల మండలం బొడ్లంక గ్రామానికి చెందిన రిమాండ్ ఖైదీ కన్నోజి రాజబాబు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గత నెల 25న మరణించాడన్నారు. బొడ్లంక సర్పంచి బోనెం రాఘవ మాట్లాడుతూ కన్నోజి రాజబాబును గత ఏడాది అక్టోబర్ 13న అడ్డతీగల పోలీసులు అరెస్టు చేశారని, 14వ తేదీన తాను రాజబాబు కుటుంబ సభ్యులతో కలిసి పోలీసు స్టేషన్‌కు వెళ్లి లాకప్‌లో ఉన్న రాజబాబుతో మాట్లాడామన్నారు. కానీ అక్టోబర్ 16న గంజాయితో పట్టుకున్నామని వై.రామవరం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయడం వాస్తవ విరుద్ధమని ఆరోపించారు. దీనిపై అడ్డతీగల, వై.రామవరం పోలీసులపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజబాబు తల్లి కన్నోజి నూకరాజు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారికి, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌కు ఇటీవల ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అలాగే గంగవరం మండలం జడేరు గ్రామానికి చెందిన ఏట్ల శివరామ కృష్ణారెడ్డి జ్వరంతో బాధపడుతూ నకిలీ ఎంబీబీఎస్ వైద్యుడు గుబ్బల సత్యనారాయణ చికిత్సతో మృతి చెందాడన్నారు. దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

శంకరరావు హయాంలో 'ఆర్యాపురం'లో భారీ అవినీతి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవం సిటీ: రిజర్వుబ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా ది ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ చల్లా శంకరరావు పాలకవర్గం రూ.కోట్లలో భారీ అవినీతికి పాల్పడిందని వైఎస్సార్ సీపీ నాయకుడు, బ్యాంక్ మాజీ డైరెక్టర్ మరిడయ్య ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రెస్‌క్లబ్‌లో పార్టీ నాయకులతో కలసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శంకరరావు చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.కోట్లను బంధువులు, అనుచరులకు రుణాలుగా ఇచ్చి అవినీతికి పాల్పడ్డాడన్నారు. ఆర్యాపురం బ్యాంక్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.ఐదుకోట్లు వెచ్చించి అక్రమాలకు పాల్పడ్డాడన్నారు. భవన నిర్మాణానికి టెండర్లు పిలవకుండా నిబంధనలకు విరుద్ధంగా సొంతంగా నిర్మాణం చేపట్టారన్నారు. అక్రమాలు, అవినీతికి పాల్పడిన చల్లా శంకరరావుపై 51 విచారణకు సిద్ధం కాగా, కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారన్నారు. త్వరలోనే స్టే అడ్డుతొలగనున్నదని, పూర్తిస్థాయి విచారణ తరువాత చర్యలు తప్పవన్నారు. ప్రస్తుత చైర్పర్సన్ గిరజాల రామకృష్ణ తులసి పాలక వర్గం బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ మార్గాని భరత్ రామ్ నగరానికి నూతన శోభ తెచ్చేలా అభివృద్ధి పనులు చేయిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ పోలు విజయలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో ఎంపీ భరత్‌రామ్ చేస్తున్న అభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ బర్రే కొండబాబు మాట్లాడుతూ మూడేళ్లుగా ఎంపీ భరత్‌రామ్ అభివృద్ధికి తెచ్చిన నిధులు, చేపట్టిన పనుల వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు. మాజీ కార్పొరేటర్ ఈతకోట బాపన సుధారాణి, వైఎస్సార్ సీపీ నగర యువజన విభాగం అధ్యక్షుడు పీతా రామకృష్ణ పాల్గొన్నారు.

పథకాలకు అర్హతే ప్రామాణికం

- ఏపీజీఅండ్‌జీసీ చైర్మన్, కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా గడపగడపకూ..



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: కులమతాలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ తెలిపారు. సోమవారం సాయంత్రం బొమ్మూరు గ్రామసచివాలయం–2 పరిధిలోని సత్యనారాయణ నగర్, కొత్తపేట ప్రాంతాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి ప్రతి సంక్షేమ పథకాన్ని లబ్ధిదారులకు వివరిస్తూ, వారికి చేకూరిన లబ్ధిని వివరించే బుక్‌లెట్లు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కరించేలా పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి సూచనలు చేశారు. ఇళ్లపట్టాలు చేతికి ఇచ్చారని, కానీ ఇప్పటివరకు స్థలం చూపించలేదని పలువురు మహిళలు వివరించగా.. చందన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ నాయకులు ఇళ్ల స్థలాలపై కోర్టుకు వెళ్లడంతో ఆలస్యమైందని, ఇటీవలే కోర్టు కేసులు క్లియర్ అయ్యాయని త్వరలోనే ఇళ్లస్థలాలు అప్పగిస్తామన్నారు. గ్రామ సచివాలయ కన్వీనర్ మత్సేటి శివ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ముద్దాల అను, నాయకులు యెనుముల త్యాగరాజు, పెయ్యల రాజేష్, తోడేటి రాజా, తోడేటి రాహుల్, జాలామోషే, బూసికృష్ణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతోందని ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు శాంతినగర్‌లో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు చీరలు, పండ్లను చందన అందజేశారు. రాజానగరం సీడీపీవో నాగమణి, పంచాయతీ కార్యదర్శి హనుమంతరావు, మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ చైర్‌పర్సన్ ఆచంట కల్యాణ్, రంజిత్, ఆనంద్, వెంకటేష్, నాని పాల్గొన్నారు.

నందకిషోర్‌కు మెరుగైన వైద్యం



ఆర్‌అండ్‌బీ ఏఈ నందకిషోర్‌ను పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇటీవల కొంతమూరులో విధి నిర్వహణలో ప్రమాదవశాత్తూ రోడ్డు రోలర్ ఘటనలో తీవ్రంగా గాయపడి రాజమహేంద్రవరం సాయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆర్‌అండ్‌బీ ఏఈ నందకిషోర్‌ను సోమవారం రాజానగరం ఎమ్మెల్యే, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జక్కంపూడి రాజా పరామర్శించారు. ముందుగా ఆసుపత్రికి సంబంధించిన డాక్టర్లతో మాట్లాడి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి ఓఎస్డీ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లామని, తొందరలో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రి లేదా అపోలో ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకుంటామని కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఆయన వెంట ఆర్‌అండ్‌బీ డీఈ మధుసూదనరావు ఉన్నారు.

నగరంలో మరికొందరికి..

ప్రకాశం నగర్: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోమవారం నగరంలో పలువురిని పరామర్శించారు. దానవాయిపేటలో నివాసముంటున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కరీంఖాన్ తనయుడు ఇద్రిస్‌ఖాన్ ఇటీవల మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మఠం వీధికి చెందిన పార్టీ నాయకుడు కుక్క తాతబ్బాయి చిన్నాన్న నామాల సుబ్రహ్మణ్యం ఇటీవల కాలంలో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

తొర్రేడులో పశువైద్యశిబిరం



వైద్యసేవలందిస్తున్న డాక్టర్ జ్యోత్స్న

రాజమహేంద్రవరం రూరల్: ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా శిబిరంలో భాగంగా తొర్రేడు పశువైద్యశాలలో సోమవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. దీనిని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చరణ్ శ్యామ్‌రాజ్ నాయక్ ప్రారంభించారు. డాక్టర్ జ్యోత్స్న, వీఎల్‌వో వీర్రాజు.. ఆవులకు, గేదెలకు, కుక్కలకు, కోళ్లకు సేవలందించారు. శిబిరం నిర్వహణకు అవసరమైన మందులు, ఇంజెక్షన్లు, మినరల్ మిక్చర్‌ను ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎస్.హైమజ్యోతి, డాక్టర్ కె.రవికుమార్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్‌పర్సన్ చిట్టూరి వెంకటరావు, సభ్యుడు దండమూడి అర్జునరావు, సీఈవో కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పెయ్యల రాజేష్

రాజమహేంద్రవరం రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించి, రాజవోలు గ్రామానికి, పాఠశాలకు పేరుప్రఖ్యాతలు తీసుకు రావాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్ అన్నారు. సోమవారం ఆయన పుట్టినరోజు సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. బొమ్మూరులోని రూత్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. బత్తిన సుబ్బారావు కమ్యూనిటీ హాల్లో ఏపీజీఅండ్‌బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆధ్వర్యంలో పెయ్యల రాజేష్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బూసికృష్ణ, కన్నబాబు, ఏసు, హరీష్, సత్యనారాయణ, గంగరాజు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఆశ్రమంలో నిత్యావసరాల పంపిణీ

ప్రకాశం నగర్: స్వర్ణాంధ్ర ఆశ్రమంలో కొత్తగా చేరిన వృద్ధులకు సోమవారం సాయంత్రం సంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు చేతుల మీదుగా నిత్యావసరాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే స్వర్ణాంధ్రలో 30 మంది వృద్ధులకు నివాసం ఇవ్వగా, మరో ఆరుగురు చేరినట్లు తెలిపారు. నగరంలోని దాతల సహకారంతో ఈ సంస్థను నడిపిస్తున్నామని, వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న మెగా అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ నటుడు రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా సోమవారం నగర చిరంజీవి యువత అధ్యక్షుడు కొత్తపేట రాజా ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ వైఎస్సార్-జక్కంపూడి బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దీనిని రొటేరియన్ ఇనుమర్తి రామకృష్ణ ప్రారంభించారు. ఈ శిబిరంలో మెగా అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ, వైఎస్సార్ సీపీ నాయకుడు బూరాడ భవానీశంకర్, నెల్లి చిన్నారి, బల్ల ప్రసాద్ పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

రామ్‌చరణ్ జన్మదినం సందర్భంగా రాష్ట్ర చిరంజీవి యువత ప్రధాన కార్యదర్శి ఏడిద బాబీ ఆధ్వర్యంలో సోమవారం ప్రియదర్శిని చెవి, మూగ ఆశ్రమ పాఠశాలలో దివ్యాంగులకు అల్పాహారం వితరణ చేశారు. నాళం వరప్రసాద్, దొడ్డి జానీ, వర్రే రాజేష్ నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ధవళేశ్వరం: గ్రామంలోని సుబ్బాయమ్మపేటలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సోమవారం ఆర్థిక సాయం, బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశారు. స్థానిక నాయకుడు సావాడ శ్రీనివాసరెడ్డి వీటిని సమకూర్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.